# 2 సమూయేలు : పాపం యొక్క ప్రభావాలు




**శీర్షిక :** 1 సమూయేలు గ్రంథం కొనసాగింపు
**రచయిత :** తెలియదు (నాతాను లేదా గాదు కావచ్చును)
**రచనకాలము :** సొలొమోను కాలము
**రచన స్థలం :** ఇశ్రాయేలు
**ఎంత కాలము :** 40 ఏండ్లు (క్రీ.పూ. 1011–971)
**ఎవరికోసం వ్రాయబడింది :** యూదులు

**ముఖ్యవచనం :** 2 సమూ 11:27– "అయితే దావీదు చేసినది యెహోవా దృష్టికి దుష్కార్యముగా ఉండెను"

**ముఖ్యపదం :** "దావీదు" 280సార్లు

**ఉద్దేశము :** దావీదు పాలన (ఎగుడు, దిగుడు) మరియు సౌలు నుండి సొలొమోను వరకు ఇశ్రాయేలు చరిత్రను వివరించుట

**అంశం :** పాపం యొక్క ప్రభావాలు

లియోనార్ట్ డ విన్సి ఆఖరి రాత్రి భోజనపు దృశ్యాన్ని చిత్రీకరించినప్పుడు, క్రీస్తు కోసం ఒక మోడల్ కావాలని వెదికాడు. పీటర్ బండినెల్లీ అనే ఒక వ్యక్తిని రోమ్‌లోని ఒక చర్చ్‌లో అతడు చూశాడు. కొన్ని సంవత్సరాలు గడిచినా చిత్రపటం పూర్తికాలేదు. ఇస్కరియోతు యూదా తప్ప శిష్యులందరిని కూడా గీసేశాడు. పాపం చేత కఠినమైన వికృతంగా మారిన ముఖంగల ఒకాయన్ని డా విన్సీ చూశాడు వీధిలో అడుక్కుతినే బిక్షగాడు అతడు. అతన్ని పిలిపించి డబ్బులిచ్చి కూర్చోబెట్టి అతని బొమ్మను గీశాడు. పటం అయిపోయేటప్పుడు బిక్షగాడి పేరును అడిగితే, అతడు నాపేరు పీటర్ బండినెల్లీ అని చెప్పాడు. "క్రీస్తు నమూనా కోసం కూడా నేనే కూర్చున్నాను" అని కూడా జవాబిచ్చాడు. ఈ మధ్యకాలంలో ఏం జరిగింది? పాపం పీటర్ జీవితంలో ప్రవేశించింది. అందుకే ఆ ముఖంలో అలాంటి వికృతరూపం. మనం దేనిని విత్తుతామో దానినే కోస్తాం (గలతీ 6:7; కొల 3:25; యోబు 4:8; హోషయా 8:7). దావీదు జీవితంలో కూడా అదే సత్యం కనబడుతుంది. దేవుని హృదయానుసారియైన దావీదు సహితం పాప పర్యవసానాలను అనుభవించాల్సిందే.

దానికి 2వ సమూయేలు గ్రంథమే మంచి ఉదాహరణ (అ.కా.13:22; 1సమూ 13:4; 1 రాజు 15:3).

**విజయం:** 2 సమూయేలు గ్రంథం 1-10 అధ్యాయాలు దావీదు విజయాన్ని చూపిస్తాయి. ఇశ్రాయేలు జాతి మొత్తం మీద నాయకుడై యెరూషలేమును జయించాడు. అందుకే అది దావీదు పట్టణంగా పిలువబడుతుంది. దానిని దావీదు తన రాజ్యానికి ముఖ్యపట్టణం చేశాడు. ఆరువేల చ.మైళ్ల విస్తీర్ణంలో ఉన్న భూభాగాన్ని 60,000 చ.మైళ్ల వరకు విస్తరించాడు. మెఫీబోషేతు పట్ల కనికరం చూపాడు. దేవుడు దావీదును అన్నీ విషయాల్లో దీవించాడు. సంపదలోను, పేరు ప్రఖ్యాతుల్లోను, భక్తిలోను తనకు తానే సాటి. అన్నీ సవ్యంగా జరుగుచున్నప్పుడు ఆధ్యాత్మిక విషయాల పట్ల అశ్రద్ధ కలిగి ఉన్నప్పుడు సాతాను దాడి చేస్తాడు.

**అతిక్రమణ :** అన్ని విధాలుగా దావీదు వర్థిల్లుచుండెను గనుక ఇరవై యేండ్లు పరిపాలన కాలంలో యుద్ధం జరుగుచున్నప్పటికిని ఇంటి యొద్దనే ఉండిపోవాలనుకున్నాడు (2 సమూ 11:1). దేవుడు మనకిచ్చిన బాధ్యతలనుండి విధులనుండి నిర్లక్ష్యం చేసి విశ్రమిస్తున్నప్పుడే సాతాను మన మీద దాడి చేయును. దావీదు యుద్ధంలో ముందుండి నడిపించినట్లుయితే అతడు పాపంలో పడిపోయేవాడే కాదు.

యెరూషలేములో మేడగదిపై నుండి రాత్రివేళ అటూ ఇటూ నడుస్తూ ఉండగా బత్సెబ స్నానం చేస్తూ కంటపడింది (2వ). చూపును తిప్పుకొని, ఆమె చిత్రాన్ని మనస్సులో నుండి తీసివేసుకుని అక్కడి నుండి తప్పుకునేది బోయి ఆమెను కామించాడు. చూపులు, శోధనలు పాపం కావు గాని వాటికి మనం లోబడితే పాపంలో పడిపోతాం. కాబట్టి శోధింపబడినప్పుడు ఒప్పుకోవలసిన పనిలేదు. పాపం చేసినప్పుడు ఒప్పుకోవాలి, తప్పుకోవాలి. యేసు కూడా మోహపు చూపు చూసినా అది పాపమే, వ్యభిచారం చేసినట్లే అని చెప్పెను (మత్త 5:28). ఫరో భార్య నుండి యోసేపు పారిపోయినట్లు దావీదు అక్కడి నుండి వెంటనే వెళ్లిపోవలసింది (ఆది 39:1-13). దేవుడు ఎల్లప్పుడు తప్పించుకొనే ఉపాయాన్ని కల్గిస్తాడు (2 కొరింథీ 10:13). మనలను లొంగదీసుకునే విధంగా సాతాను పథకం వేస్తాడు. దావీదు విషయంలో స్త్రీ, అందమైన స్త్రీ.

దావీదు విషయంలో ఒక్కసారి చేసిన పాపం కాదు. ముప్పది సంవత్సరాలుగా సాతాను దావీదు కోసం ఉచ్చు అల్లుతూనే ఉన్నాడు. దావీదు స్త్రీలోలుడు, అందుకు నిదర్శనంగా అనేకమంది భార్యలను ఉపపత్నులు అతనికి ఉండిరి (1 సమూ 27:3; 30:5), సొలొమోనుకైతే వేయిమంది భార్యలు ఉపపత్నులు ఉండిరి (1 రాజు 11:3). దావీదు కామాతురత గలవాడు, అందుకే సాతాను ఆ విధంగా దావీదుపై దాడిచేశాడు. కామం, లోభం, లేదా కోపం (మోషేను వాగ్దాన భూమిలోకి అడుగుపెట్టనీయలేదు), లేదా భయం, అది పని చేస్తుందంటే దానిని పకడ్బంధిగా అమలు చేస్తాడు. నీ జీవితంలో ఏ చిన్న పాపాన్ని బట్టి సాతానుడు నిన్ను వేదిస్తున్నాడో గమనించుము. దేవుడు నీవు శాంతి సమాధానం, ఆనందంతో ఆధ్యాత్మికంగా ఎదగాలని కోరుకుంటాడు. అయితే నీ శాంతిని భంగపరచి ఆనందాన్ని విచారంగా మార్చి మానసికంగా కృంగదీయాలనే కోరుకుంటాడు. సాతాను నీ రక్షణను తొలగించలేడుగాని నీ సాక్ష్యాన్ని, సమాధానాన్ని చెడగొడతాడు.

**పరీక్షలు:** దావీదు బత్సెబాల కథ ఎలాగు ముగించబడిందో అందరికి తెలుసు (2 సమూ 11:12). తన పాపాన్ని కప్పిపుచ్చుకొనుటకు అబద్దమాడాడు, మోసం చేశాడు (11:5-7) మత్తుపానీయాలను కూడా వినియోగించాడు (8-13వ). ఇవేవియు పనిచేయక పోవుటవలన హత్యగావించాడు (14-17). ఆ విధంగా తాను చేసిన పాపాన్ని కప్పిపుచ్చుకున్నాడు.

అయితే దేవునికి తెలుసు (27వ) అతని ఇంటి వారికి తెలుసు. తన శత్రువులకు తెలియకముందే భయంకరమైన సాక్ష్యం వారికిచ్చాడు (12:14) తరువాత దావీదు పశ్చాత్తాపపడ్డాడు (12:1-13; కీర్త 51). అనేక సంవత్సరాలు దోషభావనతో కుమిలిపోయాడు (32 కీర్తన), అయినా, పర్యవసానాలు కొనసాగాయి; బిడ్డ చనిపోయాడు, మరొకని భార్యను తన భార్యగా చేసుకున్నాడు. దావీదువలె అతని సంతానం కూడా కామాతురత కలిగి ఉండిరి. మానభంగము, హత్య, మోసం ఆయన కుటుంబాన్ని ఏలాయి, దేశం మొత్తం బలహీనమైనది. ఇశ్రాయేలు దేశం నానాటికి దిగజారుతూ ఉంటే శత్రువులు వర్ధిల్లారు. దావీదును దేవుడు క్షమించాడు గాని పర్యవసానాలను పంటను కోయాల్సి వచ్చింది. నీ జీవితంలో సాతాను పన్నాగాలను గమనించుము. మనందరి వెంట అతడు పడుతూనే ఉన్నాడు. యేసుకు నిరంతరం సమీపంగా ఉండుటద్వారానే, శోధన నుండి పారిపోవుట వలననే అలాంటి

వినాశనకరమైన పర్యవసానాల నుండి మనం కాపాడుకోగలం. సామెతలు 28:13; ఈ విధంగా చెబుతుంది. "అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును"

## సంక్షిప్త వివరణ 2 సమూయేలు

**1. విజయం, ప్రసిద్ధి (విధేయత=దీవెన)1-10**

ఎ) ప్రజల ప్రతి చర్యలు -1

బి) దావీదు గుర్తించబడుట 2-4

సి) జాతి తిరిగి ఏకమగుట 5-6

డి) దేవుని అభయం -7

ఇ) శత్రువుల తొలగింపు 8-10

**2. పరీక్షలు, అవమానం ( అవిధేయత=తీర్పు) 11-24**

ఎ) దావీదు పతనం 11

బి) సాతాను గద్దింపు 12

సి) దావీదు విచారం 12

డి) పాపఫలితం 13-20

1) అమ్నోను పాపం-13

2) అబ్షాలోము తిరుగుబాటు 14-18

3) జాతి దీనస్థితి

4) ప్రజల విప్లవం

ఈ) దావీదు - జ్ఞాపకాలు 21-24

# కీర్తనలు : ఆరాధన

**శీర్షిక :** తంబురతో పాడదగిన పాటలు

**రచయిత :** అనేక మంది

**రచనకాలము :** క్రీ.పూ. 1410-430 వరకు

**రచన స్థలం :** పాలస్తీనా

**ఎంత కాలము :** సృష్టి నుండి క్రీ.పూ. 430 వరకు

**ఎవరికోసం వ్రాయబడింది :** కొన్ని కీర్తనలు వ్యక్తులకు, కొన్ని ఇశ్రయేలు జాతికి, కొన్ని సర్వజనులకు




**ముఖ్యవచనం :** 33-1-4-" నీతి మంతులారా, యెహోవాను బట్టి ఆనందగానము చేయుడి; స్తుతిచేయుట యథార్థవంతులకు శోభస్కరము. సితారాతో ఆయనను స్తుతించుడి, పది తంతుల స్వరమండలముతో ఆయనను కీర్తించుడి. ఆయనను గూర్చి నూతన కీర్తనను పాడుడి. ఉత్సాహ ధ్వనితో ఇంపుగా వాయించుడి. యెహోవా వాక్యము యథార్థమైంది. ఆయన చేయునదంతయు నమ్మకమైనది"

**ముఖ్యపథం :** "స్తుతి" (76సార్లు) "దీవించు" (92సార్లు)

**ఉద్దేశము :** దేవుని స్తుతించుటకు, ప్రార్థించుటకు ఇశ్రాయేలీయులకు ప్రోత్సహించుట

**అంశం :** దేవుని ఆరాధించుట.

మనం దేవుని మందిరానికి ఎందుకు వెళ్తాం? ఎందుకు వెళ్లాలి అని కాదు ఎందుకు వెళ్తాం? మందిరానికి వెళ్లుటకు నిన్ను ఏమి ప్రేరేపిస్తుంది? మందిరంలో ఆరాధన ఆరంభం కోసం ఎదురుచూస్తూ నీ మనస్సులో ఏమనుకుంటావు? అనేక కారణాలను బట్టి ప్రజలు మందిరానికి వెళ్తూ ఉంటారు. శ్రేష్ఠమైన కారణం దేవుని ఆరాధించుటకు. తాను ఎవరో, ఏమైఉన్నాడో అనే విషయాలతో భక్తుల మనస్సులు నిండిపోవాలని దేవుడు కోరుతున్నాడు. మన హృదయాలు కృతజ్ఞతతోను, స్తుతులలోను నిండి ఉండాలని ఆయన కోరుతున్నాడు.

సంఘ ఆరాధనలో రెండు విషయాలు మన దగ్గర ఉండాలి అని మార్టిన్

లూథర్ గారు చెబుతూ ఉండేవారు. బైబిలు, కీర్తనల పుస్తకం. దేవుడు తన వాక్యము ద్వారా మనతో మాట్లాడుతాడు. సంగీతం, కీర్తనల ద్వారా మనం ఆయనతో మాట్లాడుతాం. ఆయనపట్ల మనకున్న ప్రేమను కృతజ్ఞతను, స్తుతిని పాటల ద్వారా వ్యక్తం చేస్తాం.

కీర్తనల గ్రంథం యూదుల కీర్తన పుస్తకం. ఐదు కీర్తన పుస్తకాలను ఏకం చేస్తే మనకున్న కీర్తనల గ్రంథమైంది. అనేక సంఘాలు తమకిష్టమైన కీర్తనలు, పాటలను కలిగివున్న కీర్తనల పుస్తకాన్ని వాడుతారు.

**హెబ్రూ పద్యకావ్యం :** యతి ప్రాసలతో కూడిన పదాలు, దానికి సంబంధించిన సంగీతం మన కీర్తనలలో ఉంటుంది. యూదుల పద్యకావ్యం పదప్రాస కాకుండా ఆలోచనల ప్రాసతో కూడి ఉంటుంది. ఒక మాటను చెప్పి దానిని మరో మాటలతో నొక్కి చెప్పడం జరుగుతుంది. ఒక ఆలోచనను మరో ఆలోచనలతో తేటతెల్లచేయడం. దీనినే "పర్యాయపద సమాంతరం" అంటారు (కీర్త 24–3). మొదటి పంక్తిలో చెప్పబడిన సత్యాన్ని తేటపరచుటకు రెండవ పంక్తిలో దానికి వ్యతిరేక భావాన్ని వాడితే దానిని "విరుద్ధ భావ సమాంతరం" అంటారు (1:6; 37:9). మరో పద్యకావ్య రూపకం – మొదటి పంక్తిలోని భావాన్ని రెండవ పంక్తి వివరించి, విస్తరిస్తుంది. దీనినే "కృత్రిమ సమాంతరం" అంటారు (19:7–9). ఏ రకమైన పద్యకావ్యమో చూడాలంటే మొదటి పంక్తికి రెండవ పంక్తి ఎలాంటి సంబంధాన్ని కలిగి ఉందో చూడాలి. ఈ విషయాన్ని తెలుసుకుంటే కీర్తనలను సరిగ్గా వివరించగల్గుతాము.

ఈ సంగతి కేవలం కీర్తనల గ్రంథానికే వర్తించక హెబ్రీ పద్యకావ్యాలన్నింటికి వర్తిస్తుంది. యోబు, సామెతలు, ప్రసంగి, పరమగీతం, విలాపవాక్యం, పాత నిబంధనలోని అనేక భాగాలకు వర్తిస్తుంది. పాతనిబంధన 50% వరకు పద్యకావ్యం రూపంలోనే వ్రాయబడింది. అయితే ఇంగ్లీషు అనువాదంలో చాలా మట్టుకు ఆ ఒరవడి కొరబడింది.

**కీర్తనల రకాలు :** అనేక సంఘాలతో స్తుతి ఆరాధన చాలా ప్రసిద్ధికెక్కింది. అనేక విషయాలకు సంబంధించి కీర్తనలు మనకు ఉన్నాయి.

**స్తుతి కీర్తనలు :** వ్యక్తిగతంగా దేవుని స్తుతిచేసివి (18,30,34,40, 106, 116, 138), మరికొన్ని మొత్తం జాతి యావత్తు కలిసి దేవుని స్తుతించేవి (33,36,105,111,

113, 117, 135, 136, 146, 147). వీటిలో దేవుని ఎందుకు స్తుతించాలో ముందు వివరించి, ఎలాగు స్తుతించాలో చెప్పబడింది.

**విలాప కీర్తనలు :** ఇవి కూడా సాధారణమైనవే. ముందు సమస్య లేదా పరీక్షలను వివరించి విడుదల కోసం దేవుని యందు ఎలాగు నమ్మకం ఉంచాలో వివరిస్తాము. తరువాత దేవుని యందలి విశ్వాస ప్రకటన ఉంటుంది. ఇవి కూడా వ్యక్తిగతమైనవి 6,12,13,26,28, 52 58, 59, 109, 140, 142) లేదా మొత్తం దేశానికి (13, 44,60,74, 80, 83)

**మెస్సీయా కీర్తనలు :** మెస్సియా మొదటి రాక మరణం, సమాధి, పునరుత్థానం, ఆరోహణలు గురించిన కీర్తనలు (16, 22, 45, 59, 72, 89, 118, 132). దేవుని రాజ్యాన్ని ఏలే మెస్సియాకు సంబంధించినవి (2,4,7,8,20,21) 45, 47,72, 89,93, 96, 97, 98, 101, 110, 144)

**పాపపు ఒప్పుకోలు కీర్తనలు :** క్షమాపణ కోరుతూ దేవుని స్తుతిస్తూ, పరిశుద్ధ జీవితాన్ని జీవించుటకు హెచ్చరికలతో కూడినది (3,6,25,32,38, 39, 50,51, 102, 130)

**యాత్ర కీర్తనలు** : యెరూషలేముకు లేదా ఇంటికి వెళ్తూ పాడుకునేవి (120-134).

**చరిత్ర కీర్తనలు :** యూదుల చరిత్రను వివరిస్తూ, ఆయన విశ్వసనీయతను బట్టి దేవునికి వందనాలు చెల్లించి, స్తుతించాలని చెప్పేవి (78, 80,81, 105, 106, 135, 136).

నీవు హెబ్రీ పద్యకావ్యాన్ని చదువుతూ ఉండగా, విశేషంగా కీర్తనలను, అది ఏ రకమైన సమాంతరాన్ని కలిగివుందో, ఏ రకమైన కీర్తనోచూడుము. అలాగు చేయడం కొంత కష్టమైనా, కొంచెం శ్రద్ధ చూపితే మంచి మేలు కలుగును. ప్రార్థనలుగా పఠించుము, కీర్తనలుగా పాడుకొనుము, కంఠస్థం చేయుము, వాటిలో లీనమైపొమ్ము, పరలోకంలో వాటిని పాడుకోవలసి వస్తుంది గనుక ఇప్పుడే వాటిని అభ్యాసం చేయుము!

**కీర్తనలు : సంక్షిప్త వివరణ :**

కీర్తన-1 పరిచయం

**1. కీర్తించే ఆరాధన (దావీదు 1-41)**

ఆదికాండం వలె : సృష్టి, మానవుడు

స్తుతి 41:13

**2. తిరుగులాడు ఆరాధన (దావీదు, కొరహు)42-72**

నిర్గమకాండంవలె : విడుదల, విమోచన

స్తుతి 72:18-19

**3. నిరంతర ఆరాధన (అసాపు) 73-89**

లేవీకాండంవలె - ఆరాధన, పరిశుద్ధ స్థలం

స్తుతి 89:52

**4. విధేయత చూపే ఆరాధన (ఎవరో తెలియదు) 90-106**

సంఖ్యాకాండంవలె - అరణ్యం, తిరుగులాడుట

స్తుతి 106 :48

**5. పరిపూర్ణ ఆరాధన దావీదు (107-150)**

ద్వితియోపదేశంవలె- లేఖనాలు, స్తుతి

స్తుతి :150:6

కీర్తన 150- కీర్తనల గ్రంథానికి ముగింపు

# 14. సొలొమోను

**ముఖ్య సంఘటనలు :**సొలొమోను ఆధ్వర్యంలో రాజ్యం

**ముఖ్యవ్యక్తి :** సొలొమోను

**బైబిలు గ్రంథాలు :** 1 రాజులు, సామెతలు, ప్రసంగి, పరమగీతము


**బైబిలు వచనము :** 1 రాజులు 10:23-24- "ఈ ప్రకారము రాజైన సొలొమోను ధనముచేతను జ్ఞానము చేతను భూపతులందరిలో అధికుడై ఉండెను. అతని హృదయమందు దేవుడు ఉంచిన జ్ఞానవాక్కులను వినుటకై లోకులందరు అతని చూడగోరిరి.


**కాలము :** క్రీ.పూ. 970


**ఈ సమయంలో ప్రపంచ సంఘటనలు :** భారతదేశంలో లోహ యుగము

**భౌగోళిక స్థలం :** పాలస్తీనా

దావీదు కుమారుడైన సొలొమోను కూడా 40 ఏండ్లు ఇశ్రాయేలీయులను



పరిపాలించెను. సౌలు దావీదువలె దేవునిపట్ల అంకితభావం గలవాడు కాదు, అదే మాదిరి సొలొమోను కూడా దేవుని పూర్ణహృదయముతో అనుసరించలేదు. సొలోమోను ఏలుబడిలో ఇశ్రాయేలు దేశం సుసంపన్నంగా ఉన్నది గాని తరువాత రెండు దేశాలుగా విడిపోయి తదనంతరం చెరలోనికి వెళ్లిపోతోంది. అందరికంటె సొలొమోను ధనవంతుడు, జ్ఞానిగాని అన్ని విషయాలలో అతడు దేవునికి విధేయత చూపలేదు గనుక జాతి క్షీణించడం ఆరంభమైంది.

**సొలొమోనును కలుసుకుందాం**

సొలొమోను ఒక్కమాటలో వర్ణించాలంటే "మహాజ్ఞాని, తెలివిమాలినవాడు" సొలో మోను అనగా 'సమాధానం'. తన తండ్రియైన దావీదు చనిపోగా అతని స్థానంలో సొలొమోను రాజాయెను (1 రాజులు 1:33-39). దేవుని ప్రజలను ఎలాగు పాలించాలో తన కుమారునికి దావీదు సూచనలను ఇచ్చెను (1 రాజు 2:1-9). దేవుడు కోరిన విధంగా దేవుని ప్రజలను నడిపించాలంటే ఎంతో వివేకం కావాలి. అందుకే దేవుని వివేకం ఇవ్వమని కోరాడు (1 రాజులు 3:5-15).

సొలొమోనుకు జ్ఞానము ఎంతో ప్రాముఖ్యమైనది. దేవుడు దానిని ఆయనకిచ్చాడు (1 రాజు 4:29-34); తన జ్ఞానాన్ని వ్యక్తం చేయుటకు సామెతల గ్రంథాన్ని వ్రాశాడు. అందులో 917 సామెతలు గలవు. సొలొమోనుకంటే యేసు అధిక జ్ఞానం గలవాడు (మత్త 12:42). అయితే మనకు జ్ఞానము కొదవగా ఉంటే దేవుని అడిగితే ఆయన మనతో పంచుకుంటాడు (యాకోబు 1:5). రాజుగా సొలొమోను తన జ్ఞానాన్ని వాడుకునేలా దేవుడు చేశాడు (1 రాజు 3:16-28).

సొలొమోను తండ్రి దావీదు దేవుని కొరకు ఒక మందిరాన్ని నిర్మించాలనుకున్నాడు. అయితే దేవుడు అందుకు అనుమతినివ్వలేదు. ఈ ఆధిక్యత సొలొమోనుకు ఇవ్వబడింది. (1 రాజు 8:12-21). దేవుడు సంతోషించి, ఆశీర్వదిస్తానని వాగ్దానం చేశాడు అయితే అతని సంతానం తన విధేయులై జీవించినప్పుడు అనే షరతు పెట్టెను (1రాజు 9:1-9).

దేవుడు సొలొమోనును భూమిమీద అత్యంత జ్ఞానం గలవానిగా చేయడమే కాకుండా, అడుగకపోయినా సంపన్నునునిగా చేశాడు (1 రాజు 10:14-15; 23-29). తన దావీదు అద్భుతమైన రాజ్యాన్ని సొలొమోనుకివ్వడమే కాకుండా,


అతనికివ్వబడిన సంపదను బట్టి ఇతర దేశాల నుండి అనేకమంది స్త్రీలను భార్యలుగా చేసుకున్నాడు. పొరుగు రాజులతో సత్సంబంధాల కోసమే లేదా శాంతి ఒప్పందం కోసమో అలా చేశాడు. ఏడువందల మంది భార్యలు 300 మంది ఉపపత్నులు, వారంతా దేవుని ఎరుగక అన్యదేవతలను ఆరాధించేవారు. సొలొమోను హృదయాన్ని మార్చివేశారు (1 రాజు 11:1-6). దేవుడు విధించిన ధర్మశాస్త్రానికి, ఆజ్ఞలకు ఇది విరుద్ధం (ద్వితి 17:14-17). దీనిని బట్టి దేవుడు ఎంతో కోపగించుకున్నాడు (1 రాజు11:9-13, 31).

మరో తెలివిమాలిన పనేమిటంటే, తన విలాసవంతమైన జీవితాన్ని గడుపుటకు ప్రజల మీద అధిక పన్నుల భారం మోపాడు. అందువలన ప్రజల అభిమానాన్ని పోగొట్టుకున్నాడు. తన మరణానంతరం దేశం రెండుగా విడిపోవుటకు కారణమైంది సొలొమోను 40 ఏండ్లు యెరూషలేమును పరిపాలించెను (1 రాజు 11:41-43).

ఆ విధంగా సొలొమోను ఎంత తెలివిగలవాడో అంత తెలివితక్కువగా వ్యవహరించాడని మనం చూశాం. దేవునికి అవిధేయత చూపుట ఎప్పటికైన బుద్ధిహీనమైన పనే, నీకు ఎంత జ్ఞానం ఉన్నా, సంపద ఉన్నాగాని. సమృద్ధిని కలిగివున్నప్పటికీ దేవునిలో సత్సంబంధాన్ని కలిగి ఉండేలా అవి చేయలేక పోయాయి.

దేవుని మార్గం నుండి వైదొలగుటకు నిన్ను ఏది శోధిస్తుంది? నీకు దేవుడు అనేక దీవెనలను అనుగ్రహించినప్పటికీ ఆయననుండి ఎక్కడ తొలగిపోతున్నావు? తెలివిమాలిన పనులు చేయకుము. ఆయన చెప్పినట్లుగా ఎల్లప్పుడు చేయుము, ఆయన ఎందుకు చెబుతున్నాడో తెలిసే చెబుతాడు.

# 1 రాజులు : విగ్రహారాధన




**శీర్షిక :** ఇశ్రాయేలు రాజుల అనంతరం

**రచయిత :** తెలియదు (యిర్మీయా కావొచ్చునేమో)

**రచనకాలము :** అనేక సంవత్సరాలు

**రచన స్థలం :** ఇశ్రాయేలు -యూదయ

**ఎంత కాలము :** 130 సం.రాలు (క్రీ.పూ. 791-841)

**ఎవరికోసం వ్రాయబడింది :** యూదులు

**ముఖ్యవచనం :** "... అతనికి ఏడువందల మంది రాజు కుమార్తెలైన భార్యలను మూడు వందల మంది ఉపపత్నులు కలిగి ఉండిరి, అతని భార్యలు అతని హృదయమును త్రిప్పివేసిరి"

**కీలకపదం :** "రాజు"-250సార్లు; "ప్రవక్త" 43సార్లు

**ఉద్దేశము :** దావీదు నుండి రాజ్యము రెండుగా విడిపోయేదాక ఇశ్రాయేలు చరిత్రను చూపించుట.

**అంశం :** దేవునినుండి తిరిగి విగ్రహాలవైపు మల్లుట వలన కలిగే ఫలితము.

దేవుడు సర్వలోకాన్ని మరియు మానవుని సృష్టించాడు అయినా ఆయనకు రావలసిన గుర్తింపు లేదా గౌరవం ఆయనకు తరచుగా లభించుట లేదు. సృష్టికర్త కంటే ఎక్కువగా సృష్టిని గురించి మనకు తెలుసు. ఎప్పుడైతే సృష్టికర్తకంటె సృష్టికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తామో అది విగ్రహారాధన. దేవునికంటె ముందు మనమేమి ఉంచినా అది విగ్రహారాధన అవుతుంది, డబ్బు, వస్తువులు, సంతోషము, కుటుంబం, సెక్స్, పేరు ప్రఖ్యాతలు, ఆహారము, విద్య, సంగీతం, ప్రేమ... వీటన్నింటికి 1 రాజుల గ్రంథం తీవ్రమైన హెచ్చరికనిస్తుంది.

**సొలొమోను విజయము** పాపం అనంతరం దావీదు పతనం ఆరంభమైంది. సొలొమోను తన 20వ యేటనే ఇశ్రాయేలు రాజుగా నియుక్తుడైయ్యాడు. దేవునికి సమీపంగా ఉండమని దావీదు సొలొమోనుకు హితోపదేశం పలికెను. దావీదు, దేవునికి దగ్గరగా ఉన్నాడు, దూరంగా ఉన్నాడు, దేవునికి దగ్గరగా ఉండుటే శ్రేష్టమని

తెలుసుకున్నాడు. అయితే దురదృష్టవశాత్తు తల్లిదండ్రుల సలహాలను పిల్లలు తీసుకోరు. గత తరం పొరపాట్ల నుండి పాఠం నేర్చుకొనుటకు ఇష్టపడం, సొలొమోను అలాగే చేశాడు.

సొలొమోను ఆరంభం మంచిగానే ఉండెను. ఏదికోరితే అది అతనికి అందుబాటులో ఉండెను. దేవుని ప్రజలను సరిగ్గా ఏలుటకు కావలసిన జ్ఞానం ఇమ్మని దేవుని కోరాడు. అయితే దేవుడు అతనికి జ్ఞానంతో పాటు డబ్బును, పేరు ప్రఖ్యాతలను అనుగ్రహించెను.

దేవాలయాన్ని నిర్మించుటలో దావీదుకు లేని ఘనత సొలొమోనుకు దక్కింది. ఇశ్రాయేలు ఆధ్యాత్మిక స్థితికి ఇది తార్కానం. దేవునిగాని, ఎవరినైనా గాని ఆరాధించాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఇది సహజం. మనం దేనికో ఒక దానికోసం బ్రతుకుతాం, దేనిమీదో ఒక దానిమీద నమ్మకం ఉంచుతాం, సంతృప్తి, పరమార్థం కోసం దేనికో ఒక దానివైపు మళ్లుతూ, ఆదరణ, నెమ్మదికోసం దారులు వెదుకుతూ ఉంటాం. దురదృష్టవశాత్తు చాలామంది సృష్టికర్త స్థానంలో సృష్టిని పెట్టి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఇది విగ్రహారాధన!

సొలొమోను పాలనలో ఇశ్రాయేలు దేశం సుభిక్షంగా ఉండెను. ప్రపంచం నలుమూలల నుండి వ్యాపార రాకపోకలు ఉండుట వలన ఆర్థికంగా బలోపేతమైంది. ఇశ్రాయేలు దేశవిస్తరణ కోసం యుద్ధాలు జరుగలేదు గాని సైన్యాన్ని సరిహద్దులో మొహరించి ఉంటారు. శాంతి నెలకొని ఉన్నందువలన అభివృద్ధి జరిగింది. అదే సమయంలో వినాశన విత్తనం నాటబడింది.

**సొలొమోను మోహం** ఇతర దేశాలతో శాంతియుత సంబంధాలను కలిగి ఉండుటకు దేవుని మీద ఆధారపడకుండా శాంతి ఒప్పందంలో భాగంగా ఆయా దేశాల రాకుర్తెలను భార్యలుగా చేసుకున్నాడు. 700 మంది రాకుమార్తెలు భార్యలుగా 300 మంది ఉపపత్నులుగా ఉంచుకున్నాడు. దావీదు చేసినట్లుగానే ఒకే భార్య సిద్ధాంతాన్ని తుంగలో త్రొక్కేశాడు. ఇంకా ఘోరం ఏమిటంటే వీరు యెహోవా దేవుని ఎరిగినవారు కారు. వారు తమతమ దేవతలను వెంట తెచ్చుకున్నారు. విగ్రహారాధనను కొనసాగించారు. వాటిని గురించి వారి పిల్లలకు బోధించారు. చివరికి సొలొమోను కూడా విగ్రహారాధనవైపు మళ్లాడు. విగ్రహారాధనతో పాటు అనైతిక సంబంధాల వైపు సొలొమోను తిరిగెను.

**సొలొమోను విచారము** సొలోమోను వయస్సు 60కి వచ్చేసరికి, అతని జీవితం, రాజ్యం విచ్ఛిన్నమైంది. యుక్తవయస్సులో ఉన్నప్పుడు నమ్మకమైన ప్రేమగల భార్యను గురించి పరమగీతాన్ని వ్రాసిన సొలొమోను ఇప్పుడు మారిపోయాడు. వయస్సు మళ్లిన తరువాత అనుభవంతో వ్రాసిన సామెతలు విగ్రహారాధన, అపవిత్రతకు దూరంగా పారిపొమ్మని హెచ్చరించాడు. అయితే తన సలహాను పాటించకుండానే చెప్పాడు. డబ్బు, అధికారం ఉన్నప్పటికీ దేవుడు లేకుండా జీవితం ఎంతో శూన్యంగా ఉంటుందో ప్రసంగిలో చూపాడు. సొలొమోను జీవితం ఎంత విచారకరంగా ముగించబడింది. సొలొమోను హృదయంలో దేవునికి స్థానం లేకపోయింది. అయితే దావీదు దేవుని ప్రేమించెను.

**విగ్రహారాధన పర్యవసానాలు** సొలొమోను మరణానంతరం ఇశ్రాయేలు దేశం, డబ్బు, అధికార వ్యామోహం కోసం రెండుగా చీలిపోయింది. విగ్రహాలు నేటికి ప్రజలను పాడుచేస్తూ ఉన్నవి. ఉత్తర భాగం వున్న పదిగోత్రాలవారు ఆరాధించుటకు రెండు బంగారు దూడలను చేసుకొని విగ్రహారాధనలో మునిగిపోయారు. దక్షిణ భాగం యూదయలో దేవాలయము ఉన్నప్పటికీ ఆధ్యాత్మికంగా ఏ మాత్రం నిష్ఠత లేకపోయింది. ఏలీయాకాలంలో ఉజ్జీవం కలిగినప్పటికీ దేవుని నుండి దేశము తొలగిపోతూ నైతికంగా దిగజారింది. ఇదంతా ఎందుకు జరిగిందంటే, సృష్టికర్తకంటే ముందు సృష్టిని పెట్టుట వలననే.

నీ జీవితంలో దేవునికి ప్రాధాన్యత నిస్తున్నావా? సృష్టికర్తకా లేదా ఆయన సృష్టించి కొంత భాగానికా? దేవుని హెచ్చరిక స్పష్టంగా ఉంది, సృష్టకర్తనే ఆరాధించు విగ్రహాలకు దూరంగా ఉండుము (1 యోహా 5:21).

## సంక్షిప్త వివరణ 1 రాజులు :

### 1. సొలొమోను - సమాధాన స్థితి 1-11

ఎ) దావీదు స్థానంలో సొలోమోను 1-2

బి) సొలొమోను ఆలోచన, తెలివి 3-4

సి) సొలొమోను స్థిరాస్తులు, వ్యాపారం 5-8

డి) సొలొమోను పేరు ప్రఖ్యాతలు 9-10

ఇ) సొలొమోను తొలిగింపు 11

**2. చీలిపోయిన రాజ్యం - విషాధం 12-22**

ఎ) ఇశ్రాయేలు తిరుగుబాటు 12

బి) యెరొబాము తిరుగు బాటు 13-14

సి) ఎలీయా ఉజ్జీవం 15-22 ఎ

డి) జాతి పతనం 22 బి

# సొలొమోను గీతం : దాంపత్య ప్రేమ

**శీర్షిక :** సొలొమోను రచించిన ప్రేమ గీతం




**రచయిత :** యువ సొలొమోను

**రచనకాలము :** క్రీ.పూ. 970

**రచన స్థలం :** యెరూషలేము (?)

**ఎన్నాళ్లు? :** షూలమ్మితీతో సొలొమోను వివాహం అనేక సంవత్సరాలు (పరమగీతం 6:3)

**ఎవరికోసం వ్రాయబడింది :** ఆ కాలంలోని యువ ప్రేమకుల కోసం, 2:16–"...నా ప్రియుడు నావాడు నేను అతని దానను పద్మములున్నచోట అతడు మందను మేపుచున్నాడు"

**ముఖ్యవచనం :** "ప్రియుడు" (32సార్లు), ప్రేమ, రమ్ము,

**ఉద్దేశము :** వివాహాన్ని ఘనపరచుట, వివాహంలోని ప్రేమను కొనియాడుట (ఉద్వేగభరిత, శారీరకమైన)

**అంశం :** భార్యభర్తల మధ్య వున్న మృదువైన ప్రేమను చూసి దేవుడు సంతోషిస్తాడు. వివాహం విజయవంతం అగుటకు ప్రేమెంతో అవశ్యకం.

అనేక శతాబ్దాలుగా తమ మధ్యవున్న ప్రేమను వ్యక్తం చేయుటకు స్త్రీ పురుషులు అనేక విధానాలను వాడారు. వాటిలో అతి సాధారణమైనది పద్యాన్ని లేదా గీతాన్ని వ్రాయడం. సహజమైన ప్రేమ తాను ప్రేమించిన వ్యక్తి వ్యక్తిగతంగా ప్రేమ కార్యాన్ని వ్రాసి అంకితమివ్వడం ఆనవాయితీ. పరమగీతము ప్రేమకథ, స్త్రీ, జ్ఞాపకాలను వాడుతూ భర్త వ్రాసినది. వారి తొలిచూపులో వివాహం ఆ తరువాత వారు ఎదుర్కొనిన సంఘర్షణలు అన్నియు పరమగీతంలో వర్ణించబడినవి. ఇది వ్యక్తిగతమైనది. అయినప్పటికీ, మన అధ్యయనం కోసం దేవుడు బైబిలులో ఉంచాడు.

**ఒక ప్రేమ కథ :** 14 లఘు ప్రేమగీతాల సంకలనమే పరమగీతం. అయితే

క్రమంగా అవి పొందుపర్చలేవు. ఒక సినిమా ఫ్లాష్‌బ్యాక్‌లలో నిండి ఉంటుంది. ఇది ఒక పద్యకావ్యం. ఈ భాష నేడు మనకు క్రొత్తగా అనిపిస్తుంది. ప్రతి దంపతులు

తమ స్వంతప్రేమ భాషను అభివృద్ధి చేసుకుంటారు. అది వారి సంస్కృతికి అద్దం పడుతుంది. సెక్స్‌ను వివరించుటకు వాడే వైద్యపరమైన పదాలు అంతర్లోతైన భావాన్ని వివరించలేవు. అదే విధంగా సాంస్కృతిక యాసకూడా ముడిసరుకుల్లాంటిదే. అయితే ప్రేమ భాష లోతైన ఉద్వేగభరిత భావాన్ని వివరిస్తుంది.

దేవుడు సెక్స్‌ను లోకంలోకి పాపం ప్రవేశించకముందే సృష్టించెను అనే విషయాన్ని జ్ఞాపకం చేసుకొనుము. దేవుని ప్రేరణచే పరమగీతం వ్రాయబడింది గనుకనే బైబిలులో పొందపరచబడింది. ఇద్దరి దంపతులమధ్య (స్త్రీ పురుషుల) వున్న సెక్స్ సంబంధం ఎంతో అద్భుతం, సుందరం దేవుని దృష్టిలో సెక్స్ విషయంలో మన పవిత్రత మరియు అమాయకత్వం మనం నివసించే సంస్కృతికి మనకు దూరం చేసింది గనుక సెక్స్ పట్ల పవిత్రాలోచనలకు మన మనస్సులో తావు లేకుండా పోయింది. పెండ్లి చేసుకున్న స్త్రీ పురుషులకు దేవుడిచ్చిన వివాహ వరం సెక్స్, అది ఎంత అందమైనదంటే తన సంఘంలో దేవుని ఐక్యతకు ఉదాహరణంగా వాడబడింది. వివాహ వ్యవస్థను, సెక్స్‌ను చిన్నాభిన్నం చేయుటకు సాతాను శత విధాల ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. సెక్స్‌ను గురించి సంఘంలో చర్చించుము, ప్రార్థించుము. అది అంగీకృతంకాదు, ఇబ్బంది కలిగిస్తుంది. అయితే సొలొమోను, షూలమ్మీతి విషయంలో ఇలాంటి దేమి లేదు. దేవుడు మనం పోగొట్టుకున్న అమాయకత్వాన్ని పునరుద్ధరించి పవిత్రమైన దృష్టిలో సెక్స్‌ను చూసేలా చేయుమని ప్రార్థన పూర్వకంగా ఈ గ్రంథాన్ని చదవాలి.

**వివాహంలో వున్న ప్రేమ** (1:1–5:1) మొదటి సగభాగం వారి పెండ్లిరోజును గూర్చి వర్ణిస్తుంది. వ్యాపారం నిమిత్తం గలిలయా ఉత్తరభాగానికి సొలొమోను వెళ్లినప్పుడు అక్కడ షూలమ్మితీ తారసపడుతుంది. షూలమ్మీతి పట్టణంలో వున్న కన్యల కంటె భిన్నమైనది, యెరూషలేములో వున్న స్త్రీలందరికంటే కూడా వేరుగా కనిపించింది ఆమె అమాయకత్వం, యధార్థత సొలొమోను హృదయాన్ని దోచేసింది. వారిద్దరు కూడా వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని వెదుకుటకు ఈ

సమయాన్ని వాడుకున్నారు. అయితే వివాహానికి ముందు వారు లైంగిక సంపర్కంలో పాల్గొన లేదు. వివాహానికి ముందు ఎలాంటి కామకలాపాలకు తావివ్వకూడదని మూడుసార్లు పాఠకులకు రచయిత హెచ్చరిస్తాడు (2:7; 3:5; 8:4). వివాహానికి ముందు లైంగిక పరమైన వాంఛలు చెలరేగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సొలొమోను, షూలమ్మితీలు ఆ విధంగా ఉండిరి.

పెండ్లి రాత్రి రానేవచ్చింది. అందం ఆనందం, కలుసుకునే రోజుది. పెండ్లి తంతుకు నేడు ఇచ్చినట్లు అంత ప్రాధాన్యతను వారివ్వలేదు. వారి మొదటి రాత్రి మీదే దృష్టిని నిలిపారు. వారి ముచ్చట్లను గురించి, వారి అనుభవాలను గురించి వివరంగా చెప్పబడింది (1:15-2:7; 4:12-5:1). అది ఎంతో అందంగాను, ప్రేమగాను వర్ణించబడింది. వాస్తవంగా సంపూర్ణంగా ఒకరినొకరు సంతోషించి ఆనందించాలని దేవుడు తానే ప్రోత్సహించాడు. వారు చేస్తున్నదానికి నూటికి నూరుశాతం ఆమోదాన్ని తెలిపాడు దేవుడు (5:1)

**వివాహ జీవితం :** (5:2-8:14) – అన్ని సంబంధాల వలె వివాహ సంబంధంలో కూడా విషయాలు అన్ని సవ్యంగా జరుగవు. ఆమె తన తల్లిదండ్రుల ఇంటిని విడచును బెంగతో బాధపడుతూ ఉంటే ఈయన ఊర్లేలుతున్నాడు. ఒకరినొకరు అశ్రద్ధ చూపారు. దాని ప్రభావం వారి లైంగిక జీవితం మీద పడింది. వ్యక్తిని ఎందుకు పెళ్లి చేసుకున్నాను అనే విషయాన్ని వారిరువురు గ్రహించాల్సిన అవసరం ఉంది. తన జీవిత భాగస్వాములు నా అవసరాలను ఎలాగు తీర్చుతుందని భావించకుండా ఒకరినొకరు ఎంత బాగా శ్రద్ధచూపించగలము అని ఆలోచించుకోవాలి. వారి తొలిప్రేమను జ్ఞాపకం చేసుకోవాలి. ఈ గ్రంథం లైంగికంలో బాధపడుచున్న మన సంస్కృతి రోగాన్ని కుదుర్చగల దివ్యౌషదాన్ని మనకందిస్తుంది.

## పరమగీతం సంక్షిప్త వివరణ

### 1. పెండ్లిచూపులు (లెబానానులో)

ఎ) పవిత్రతను అభివృద్ధి పరచుకొనుట 2:8-14

బి) సమస్యలను ఓడించుట 2:15-17

సి) ప్రాధాన్యతలను నిర్ణయించుట 3:1-5

**2. పెండ్లి (యెరూషలేము రాజమహల్‌లో)**

ఎ) పెండ్లి ఊరేగింపు 3:6-11

బి) పెండ్లి సిద్ధపాటు 1:1-8

సి) పెండ్లి విందు 1:9-14

డి) పెండ్లి రాత్రి 11:15-27

ఇ) పెండ్లి రాత్రి 11-4:1-5:1

**3) వివాహ జీవితం**

ఎ) లైంగిక సర్దుబాటు (యెరూషలేము రాజమహల్) 5:2-8

1. తప్పుడు వైఖరీ 5:2-8
2. సరైన వైఖరి 5:9-6:3
3. బేషరతు అంగీకారం 6:4-10
4. సంపూర్ణ సమర్పణ 6:11-13
5. సంపూర్ణ సంతోషం 6:13-8:4

బి) ఇతరులకు ప్రాధాన్యత నిచ్చుట (లెబానోను) 8:5-14

# సామెతలు : జ్ఞానం




**శీర్షిక :** “ప్రాతినిధ్యం వహించుట” – హెబ్రీభాష
అర్థం. “అలాగు ఉండుట”

**రచయిత :** సొలొమోను మరియు ఇతరులు

**రచనకాలము :** క్రీ.పూ. 950–700

**రచన స్థలం :** యూదయ ప్రాంతం

**రచనకాలము :** క్రీ.పూ. 950–700

**ఎవరికోసం వ్రాయబడింది :** సొలొమోను కుమారుల కోసం (1:8; 2:1). అయితే మానవాళి కొందరికి అన్వయించబడును.

**ముఖ్యవచనం :** 1:1–7–11 దావీదు కుమారుడును ఇశ్రాయేలు రాజునైన సొలొమోను సామెతలు : జ్ఞానమును ఉపదేశమును అభ్యసించుటకును వివేక సల్లాపములను గ్రహించుటకును నీతిన్యాయం యథార్థతలననుసరించుటయందు బుద్ధికుశలత ఇచ్చు ఉపదేశము నొందుటకును, జ్ఞానములేని వారికి బుద్ధి కలిగించుటకును యౌవనులకు తెలివియు వివేచనయు పుట్టించుటకును తగిన సామెతలు జ్ఞానము గలవాడు విని పాండిత్యము వృద్ధిచేసికొనును వివేకముల వాడు ఆలకించి నీతిసూత్రములను సంపాదించుకొనును. వీటి చేత సామెతలను భావసూచక విషయములను జ్ఞానుల మాటలను వారు చెప్పిన గూఢవాక్యములను జనులు గ్రహించుదురు. యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము మూర్ఖులు జ్ఞానమును ఉపదేశమును తిరస్కరించుదురు”

9:10–11 “యెహోవాయందు భయభక్తులు కలిగి యుండుటయే జ్ఞానమునకు మూలము పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము”

**ముఖ్యపదాలు :** “నా కుమారుడా” (22సార్లు) “జ్ఞానము” (119 సార్లు), “ఉపదేశము” (26 సార్లు)

**ఉద్దేశము :** ఇంగిత జ్ఞానమును ఇచ్చుట

**అంశం :** భూమిమీద జీవించుటకు పరలోక సూత్రాలు

వివేకము అనగానేమి? అది మనకుందా? ఒక వ్యక్తి వివేకంగలవాడని నీకు ఎలాగు తెలుస్తుంది. ఈ వివేకం ఎక్కడినుండి వస్తుంది? మనం ఈనాడు వివేకాన్ని అంతగా పట్టించుకోవడం లేదుగాని అది ఎంతో ప్రాముఖ్యమైనది. వివేకం గలిగి ఉండుట అనగా దేవుడు చేసినట్లు నిర్ణయాలు చేయుట, దేవుడు చూపినట్లు చూడగల్గుట, దేవునికున్న వైఖరీ మాదిరి వైఖరిని కలిగిఉండుట అనగా క్రీస్తు మనస్సును కలిగిఉండుట, యేసు ఏ విధంగా ఆలోచిస్తాడో ఆ విధంగా ఆలోచించుట. సామెతల గ్రంథం వివేకాన్ని కలిగి ఉంది. దైవిక దృష్టిలో సూత్రాలు, అయితే వాగ్దానాలు లేవు.

వివేకం అనగా నేమి? మొదటి 7వ వచనాలతో నిజమైన వివేకం ఏమిటో సొలొమోను చెబుతున్నాడు. మొదట, దేవుని గూర్చిన జ్ఞానము (1:4). వాస్తవాలను తెలుసుకున్నంత మాత్రాన ఎవరూ వివేకవంతులుకాలేరు. వాస్తవాలను సరిగ్గావాడుకోగల ప్రజ్ఞనే వివేకం అంటాం. అయితే వాస్తవాలు ముడిసరుకులు వివేకంగా మారుటకు అవసరం. దేవుని గూర్చిన జ్ఞానం విషయంలో ఇది నిజము. దేవుని ఎరుగుట మరియు ఆయన మాటలు మనలను మన వాస్తవాలు లభ్యమవుతాయి. వాటి ఆధారంగా వివేకం రూపుదిద్దు కొంటుంది. ఇతరులు చెప్పగా వినుటద్వారా లేదా చరిత్రను చదువుట వలన కూడా అధికమైన జ్ఞానాన్ని నేర్చుకోవచ్చును. ఈ విధానం ద్వారా వివేకవంతులుగా మారుటకు, జ్ఞానాన్ని సమకూర్చుకొనుటకు ఇది శ్రేష్ఠమైన విధానం.

తరువాత, వివేకంలో ఒక భాగం ఉపదేశము మరియు అవగాహన అని సొలొమోను తన కుమారునికి చెబుతున్నాడు (1:2; 2:2; 14:33). ఒక ప్రత్యేకమైన పరిస్థితిలో మంచి చెడుల మధ్య విమోచించగల సామర్థ్యాన్నే వివేకం అంటారు. వాస్తవంగా అలాంటి సామర్థ్యం దేవుని పరిశుద్ధాత్మ ద్వారానే కలుగును (యాకో 1:5). ఆయన నడిపిస్తుండగా మనం దేవుని పరిశుద్ధాత్మకు జాగురూకతగా ఉండాలి. అతి తెలివిగా ఉండుటకంటె సున్నితంగా ఉండుట ముఖ్యం.

మూడవది, క్రమశిక్షణ వివేకానికి అత్యవసరం. శరీరం తేలికైన మార్గాన్ని కోరుకుంటుంది, దానిని నిరోధించాలి అంటే క్రమశిక్షణ ఎంతో అవసరం. ఆలోచించుటకు నేర్చుకోవాలన్నా, ప్రశ్నించాలన్నా ఓపికతో విషయ పరిజ్ఞానాన్ని సంపాదించాలన్న, సంపూర్ణంగా వాస్తవాలను పరిగణలోకి తీసుకొని యథార్థంగా

ఉండాలన్నా, వివేకంతో చేసిన నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్నా, వివేకం యొక్క అవసరతను ఒప్పుకోవాలన్నా, ఇతరుల సహాయము తీసుకోవాలన్నా క్రమశిక్షణ ఎంతో అవసరం. క్రమశిక్షణ వివేకంలో ప్రాముఖ్యమైన అంశం.

ఇంగిత జ్ఞానము కూడా వివేకంలో ఒక భాగమే (1:3) వివేకం అంటే దూరమైనది కాదు, అందుకోలేనిది కాదు, అర్థంకానిది కాదు. అది ఇంగిత జ్ఞానమే. వాటిని గురించి నీవు నిజంగా ఆలోచించితే, సామెతలు మరియు యేసు బోధలు కేవలం ఇంత జ్ఞానముతో కూడిన వ్యాఖ్యానాలే.

మనం వివేకాన్ని ఏ విధంగా పొందగలం? మనం శ్రేష్ఠమైన విద్యావిధానం గల దేశం అయినప్పటికినీ, వివేకం కొరత మనకుంది. మనం దాని వెదకము, దానిని ఎలాగు పొందాలో మనకు తెలియదు. వివేకం కోసం ఏమి చేయాలో సామెతలు మనకు చెబుతాయి. వివేకం కోసం మనం అడగాలని మనకు సలహా ఇవ్వబడింది (2:6). మనం వివేకాన్ని కలిగి ఉండాలి అని దేవుడు కోరుతున్నాడు (లూకా 21:15). నీ కిష్టమైనది కోరుకోమని సొలొమోను దేవుడు అడిగినప్పుడు వివేకాన్ని కోరుకున్నాడు. బైబిలులో అతి ప్రాచీన గ్రంథమైన యోబు గ్రంథం ఈ ప్రశ్ననే అడుగుతాడు, మానవుడు సహజంగా వివేకాన్ని కలిగి ఉండడు (20:13). అది కొనుకుంటే వచ్చేదికాదు (20:14-19). కేవలం దేవుని నడిపింపుకై అడిగే దానికంటె యేసులా నిన్ను మార్చుమని అడిగితే, క్రీస్తుల్లాంటి మనస్సు కొరకు అడిగితే శ్రేష్ఠం (సామె 1:7). ఒక వ్యక్తిని బాగా ఎరిగితే ఒక నిర్దిష్టమైన విషయంలో అతని ఆలోచన ఏమై ఉండునో మనం తేలికగా పసిగట్టవచ్చును. యేసు విషయంలో కూడా ఇది నిజము. వివేకాన్ని పొందాలంటే మనం ధీనులమై ఉండాలని (యాకోబు 3:13-18). ఇతరుల నుండి, దేవుని నుండి సలహాలు తీసుకోవాలంటే పసిపిల్లవానిల్లాంటి వైఖరీ మనకు కావాలి.

అయితే ఇంతకు ముందుచెప్పినట్లు పరిశుద్ధాత్మ మీదే మనం ఆధారపడి ఉండాలి అనుకోండి! (1 కొరింథి 12:8). ఆయన నడిపింపుకు, సున్నితంగా ఉండాల్సి ఉంది. గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోవడం కూడా అవసరమే. జ్ఞానము రాత్రికి రాత్రే వచ్చేది కాదు. దేవుడు నీకు బోధిస్తున్న విషయాలను నమోదు చేసుకుంటే అవసరం అయినప్పుడు వాడుకునే వీలు కలుగును.

ఇతరుల నుండి కూడా నేర్చుకొనుము – విడ్రూ విల్సన్ ఈ విధంగా చెప్పెను. “నాకున్న మేథాసంపత్తిని నేను వాడుకోవడమే కాకుండా ఇతరుల దగ్గరనుండి అరువు తెచ్చుకొని వాడతాను.” ఇతరుల సలహాలు నాకు అవసరం లేదనుకొని ఎవరైనా ప్రవర్తిస్తే వారు మూర్ఖులు (యోబు 8:8–10; సామె 19:20) సామెతల గ్రంథంలో సొలొమోను గొప్ప జ్ఞానాన్ని అందించాడు దాన్ని సద్వినియోగపరచుకొనుము!

ఆఖరుగా ఎల్లప్పుడు నిత్యత్వపు వెలుగులో సమస్తాన్ని చూడాలి అని గుర్తుంచుకొనుము. ఇప్పటి పరిస్థితికి ఏది తేలికో, శ్రేష్ఠమైనదో ఆలోచించకుండా, 20, 50, 100 సంవత్సరాల కాలంలో నీవు ఏమిచేయాలని కోరుతున్నారో దానిని దృష్టిలో ఉంచుకొనుము. అప్పుడు ప్రస్తుతాన్ని సరిగ్గా అంచనా వేయగలవు.

## సామెతల సంక్షిప్త వివరణ

పీఠిక : రచన ఉద్దేశం : 1:1–7

**1. వివేకం యొక్క సూత్రాలు (సిఫారసులు) 1:1–17**

1) యువతకు సూత్రాలు (సొలొమోనుచే) 1–7

2) అందరికొరకైన సూత్రాలు (సొలోమోను) 8–9

**2. వివేకం యొక్క సామెతలు – (పోలికలు, పరిశీలనలు)** 10–29

ఎ) దైవభక్తికోసమైన సామెతలు (సొలోమోనుచే) 10–22

బి) ప్రజలను గురించిన సామెతలు (జ్ఞానులచే )23–24

సి) సంబంధాలను గురించిన సామెతలు (సొలోమోను ) 25–29

**3. వివేకం యొక్క ఆచరణ 30–31**

ఎ) అందరి ఆచరణ కోసం (ఆగూరు) 30

బి) భార్యల ఆచరణ కోసం (లేమూయేలు) 31

# ప్రసంగి : దేవుడు లేని జీవితం వ్యర్థం




**శీర్షిక :** ప్రసంగి
**రచయిత :** సొలొమోను (వృద్ధాప్యంలో)
**రచనకాలము :** క్రీ.పూ. 935
**రచన స్థలం :** యూదయ
**రచనకాలము :** సొలొమోను తరువాత రోజులు
**ఎవరికోసం వ్రాయబడింది :** సొలొమోను కుమారులకు (12:12)

**ముఖ్యవచనం :** 1:12-14 " ప్రసంగినైన నేను యెరూషలేమునందు ఇశ్రాయేలీయుల మీద రాజునైయుంటిని. ఆకాశము క్రింద జరుగునది అంతటిని జ్ఞానముచేత విచారించి గ్రహించుటకై నా మనస్సు నిలిపితిని; వారు దీనిచేత అభ్యాసము నొందవలెనని దేవుడు మానవులకు ఏర్పాటు చేసిన ప్రయాసము బహుకాలమైనది. సూర్యుని క్రింద గాలికై ప్రయాసపడినట్టున్నవి జరుగుచున్న క్రియలనన్నింటిని నేనుచూచితిని, అవి అన్నియు వ్యర్థములే, అవి ఒకడు గాలికి ప్రయాసపడినట్లున్నవి."

**ముఖ్యపదాలు :** "వివేకము" (49సార్లు), "వ్యర్థం" (37సార్లు), "సూర్యుని క్రింద" (31సార్లు)

**ఉద్దేశము :** కేవలం దేవుడు మాత్రమే సంతృప్తిపరచగలడు లోకంలో ఉన్నదేది సంతృప్తి నియ్యదు.

**అంశం :** దేవుడు లేని జీవితం, ఎన్నివున్నా అంతా వ్యర్థం.

నీవు ఎందుకు జీవిస్తున్నావు? నీ జీవితం యొక్క ఉద్దేశమేమి? అసలు జీవితం అంటే ఏమిటి? షేక్స్పియర్ జీవితాన్ని ఈ విధంగా అభివర్ణించాడు-" ఒక తెలివి మాలిన వాడు చెప్పిన కథ, ఎలాంటి ప్రాముఖ్యతలేని గందరగోళం, శబ్ద మయం." బెంజిమెన్ డిశ్రాయేలు ఈ విధంగా అన్నాడు-" యవ్వనం ఒక పొరపాటు, మధ్య వయస్సు ఒక పోరాటం, వృద్ధ్యాప్యం ఒక విచారం." మరొక మేధావి జీవితాన్ని ఈ విధంగా అభివర్ణించాడు - "మానవుడు అతిపెద్ద చక్రం మీద ఎత్తున విహరిస్తున్న రోగగ్రస్తుడు." "అతి సామాన్యమైన ప్రాకెడీ పురుగుకన్న మానవుని జీవితం ఏమాత్రం

మెరుగైనది కాదు.” కర్బనము, నీటి ముద్దయైన జీవి, కొద్దికాలం భూమి మీద ప్రాకులాడి తరువాత భూమిలో కలిసిపోయే వాడే మానవుడు. దేవుడు మనకు మార్గదర్శిగా లేని జీవితం కేవలం వ్యర్థం, అశాశ్వతమైన తేలికగా పగిలిపోయేది. మహాజ్ఞానియైన సొలొమోను వ్యర్థము, వ్యర్థము అని పలికెను (1:12-14; 2:11). దేవరహిత జీవితాన్ని ఆధ్యాత్మికతలేని జీవితాన్ని గురించి అతడు చెబుతూ ఉండెను. (సూర్యునిక్రింద .... 2:11). “వ్యర్థము” అనే పదం, ఆవిరి గురించి చెబుతుంది. జీవితం ఆవిరిలాంటిది! దేవుడు లేని జీవితం వ్యర్థమైతే దేవుడు లేకుండా ప్రజలు ఏ విధంగా జీవిస్తున్నారు? జవాబు ఏమిటంటే, ప్రత్యామ్నాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఈ ప్రత్నామ్నాయాలలో ఏవియు మనిషిని సంతృప్తి పరచలేవు. అయితే అవి తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే ఇస్తాయి. ఒక ప్రత్నామ్నాయం పనిచేయుట లేదంటే మరోదానికోసం వెదకవచ్చును. అలాంటివి ఎన్నో అందుబాటులో ఉన్నవి.

**లోకం విధానం-** ప్రత్నామ్నాయాలు : సొలొమోను తన గ్రంథంలో మొదటి అర్థభాగంలో 7 ప్రత్యామ్నాయాలను పేర్కొన్నారు. లోక జ్ఞానం జీవితం అంటే ఏమిటో, ఏది జీవితానికి అర్థాన్ని, సంతృప్తినిస్తుందో చెబుతుందంటారు. అందులో వినోదం (ఆకర్షణ 2:1-11). పని (మానవ శ్రమ 2:18-13) 4:4-6); అహం (మానవుడే తనదైవం). 2:24-3:27), పేదరికం (4:1-3), సన్యాసం (9:7-10); సంపద భౌతికవాదం 4:7-12; 5:10-20; 6:1-12); సామాజిక పలుకుబడి (పేరు ప్రఖ్యాతలు 4:13-16) మతాచారాలను పాటించడం (5:1-7).

**దేవుని విధానం -** అసలు విషయం - తన జీవిత కాలంలో అనుభవం ద్వారా సొలోమోను తెలుసుకున్నదేమనగా దేవుడు మాత్రమే సంతృప్తి నివ్వగలడు ఎక్కడానికి ఈ ఏడు మెట్లు ఎంతో ఇరుక్కుగా ఉంటాయి అయితే లోకపు విధానాలు ఎంతో విశాలంగాను, తేలికగాను ఉంటాయి. అయితే ఇవి క్రిందికి, శూన్యతకు తీసుకొని పోతాయి. దేవుని ఉన్నతమైన మార్గమే విజయానికి నడిపిస్తుంది. దీనత్వంతో కూడిన అడుగులు ఇవి (7:57). ఓపికతో సహించే పరీక్షలు (7:8-10), క్రమశిక్షణ (లోకాన్ని, శరీరాశలను, సాతానును జయించుటకు పరిశుద్ధాత్మ ఫలము ! అన్ని విషయాలలో దేవునికి లోబడుట (8:1-9:12). దేవునియందు విశ్వాసము (10:1-20), ఇతరులకు సహాయపడుట (స్వార్థంతో కాక, ఇతరులకు సహాయపడేందుకు (11:1-8), ఆనందం

(అంతరంగ సమాధానం) (11:9–12:7).

వాస్తవంగా మనం, ఈ గ్రంథంలో కనుగొనగల్గేది దేవుని దృష్టికోణం లోకం దృష్టికోణానికిగల వ్యత్యాసం. జీవితంలో సహా ప్రతి దానికి ఒక ఉద్దేశము, కారణం ఉంటుందని బైబిలు దృష్టికోణం చెబుతుంది, మనం ఈ భూమి మీద దేవుని, ఇతరులను సేవించుటకు ఉన్నాం. నైతిక మరియు నీతిమయమైన జీవితానికి దేవుని వాక్యమే ఆఖరు అధికారం కలిగిఉంది. దానికి భిన్నంగా, మానవుడే అన్నింటి మీద అంతిమ నిర్ణయాధికారాన్ని కలిగి ఉన్నాడని లోకం దృష్టికోణం చెబుతుంది. సత్యం సాపేక్షికం అని, తనకు ఇష్టమైనట్లు జీవించి సుఖాను భూతులు పొందవచ్చునని చెబుతుంది. అందుకే ఇలాంటి దైవరహిత జీవితం వ్యర్థం కాకమరేమిటి?

నీవు నీ జీవితాన్ని ఏ విధంగా చూస్తావు? నీవు దేనికోసం జీవిస్తున్నావు? నిన్నేమి ప్రేరేపిస్తుంది! నీ జీవితానికి అర్థాన్ని, ఉద్దేశాన్ని పొందుటకు ఎక్కడ వెదకుతావు? జీవితాన్ని దృష్టించుటకు రెండే రెండు విధానాలు గలవు? దేవుని జ్ఞానం చేత లేదా లోక జ్ఞానంచేత నీవు దేనిని అనుసరిస్తున్నావు?

## ప్రసంగి గ్రంథం సంక్షిప్త వివరణ

**1. సమస్య 1–6**

ఎ) సారాంశం 1–2

1) సొలొమోనును కలుసుకుందాం

2) దేవుడు లేని జీవితం శూన్యం 1–2

బి) వివరణ 3–6

1) జీవితం విసుగు పుట్టిచ్చేది 3, 4

2) జీవితం అంతా బాగాలేదు3,4,5

3) వస్తువులు సంతృప్తి పరచవు 3,4,5,6,

**2. పరిష్కారం 7–12**

ఎ) డబ్బును తెలివిగా ఖర్చుచేయాలి 6

బి) వివేకం కలిగి ఉండుము 7-8

1) తెలివిగా జీవించుట -7

2) తెలివిగల నాయకులు -8

సి) మూర్ఖుడవు కాకుము 9-10

1) జీవన్మరణము 9

2) మూర్ఖత్వం, తెలివిలేనితనం 10

డి) నమ్మకంగా ఉండుము 11-12

1). విశ్వాసం, విశ్వాసనీయత 11

2). సత్యం, న్యాయం 12

# 15. విభజన




**ముఖ్య సంఘటనలు :** దేశము ఇశ్రాయేలు మరియు యూదయగా విడిపోవుట


**ముఖ్యవ్యక్తి :** రెహబాము, యెరొబాము, ఏలీయా ఎలీషా


**బైబిలు గ్రంథాలు :** 2 రాజులు, 1,2 దినవృత్తాంతములు


**బైబిలు వచనము :** 2 రాజు 17:21-22 "ఆయన ఇశ్రాయేలు గోత్రములను దావీదు ఇంటివారిలో నుండి విడగొట్టివేయగా వారు నెబాతు కుమారుడైన యెరొబామును రాజుగా చేసికొనిరి. ఈ యెరొబాము ఇశ్రాయేలు వారు యెహోవాను అనుసరింపకుండ ఆయన మీదవారిని తిరుగబడచేసి, వారు ఘోర పాపము చేయుటకు కారకుడాయెను. ఇశ్రాయేలు వారు యెరొబాము చేసిన పాపములలో దేనిని విడువక వాటి ననుసరించుచు వచ్చిరి"

**కాలము :** క్రీ.పూ. 930

**ఈ సమయంలో ప్రపంచ సంఘటనలు :** ఫోనిషియన్లలచే కార్తేజ్ కనుగొనబడింది. గ్రీసులో మొదటి ఒలంపిక్ క్రీడలు, రోమ్ స్థాపించబడుట, హోమర్ ఇటలీలో రచనల చేశాడు.



**భౌగోళిక స్థలం :** పాలస్తీనా దేశము ఉత్తరభాగము ఇశ్రాయేలుగా (10 గోత్రాలు) దక్షిణ భాగము యూదయగా (2 గోత్రాల వారు)గా విడిపోయిన ఈ కాలాన్ని 'విడపోవుట' అంటారు. తన నిర్మాణ పథకాలకు డబ్బు కోసము ప్రజల మీద సొలొమోను భారీ పన్నులను మోపాడు. సొలోమోను చనిపోగానే ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే సొలొమోను కుమారుడు రెహబాము తరువాత రాజాయెను. ఇతను పన్నులను తగ్గించేది పోయి ఇంకా పెంచాడు. తత్ఫలితంగా ఉత్తంలో వున్న 10 గోత్రాలు విడిపోయాయి. ఉత్తర, దక్షిణ భాగాలు తమ స్వంత రాజులను ఎంచుకున్నారు. అంతేగాక వేరు వేరు రాజధానులను ఏర్పరచుకున్నారు. కొన్నిసార్లు ఇరు దేశాల మధ్య యుద్ధంకూడా జరిగి దావీదు మహిమకరమైన రాజ్యం ఎంతటి దీనస్థితికి దిగజారిందో చూడుడి. 60 సంవత్సరాల లోపుననే ఇదంతా జరిగిపోయింది. దేవుడు వారిని ఎంతో ప్రేమించి, దీవించినప్పటికి మానవులు విశేషంగా యూదులు ఇంకా ఆయన మీద తిరుగుబాటు చేస్తూనే ఉన్నారు.

**ఇశ్రాయేలు - ఉత్తర భాగం- 10గోత్రాలు** మొదటి రాజు యెరొబాము, సొలోమోను మరణానంతరం దేశం విడిపోయినప్పుడు 22 సంవత్సరాలు ఏలెను (1 రాజులు 11:26-14:20; 2 దిన 9:29-13:22). సొలొమోను సేవకుడు ఇతడు. అహిజా ప్రవక్త ఒక వస్త్రమును చింపి 12 ముక్కలు చేసి 10 ముక్కలను యెరొబాముకు ఇచ్చెను. ఆ విధంగా ఇశ్రాయేలు 10 గోత్రాలు ఉత్తర భాగం ఏర్పడెను. చంపబడకుండా తప్పించుకొనుటకు ఐగుప్తుకు పారిపోయెను. సొలొమోను చనిపోయాక, రెహబాము పన్నులు పెంచాక అతడు తిరిగి వచ్చెను. అప్పుడు 10 గోత్రాల వారు యెరూబామును రాజుగా ఉండమని కోరారు. ఆ విధంగా అతడు ఇశ్రాయేలు రాజాయెను. అతడు రెండు బంగారు దూడలను చేయించి ప్రజలు యెరూషలేము దేవాలయానికి వెళ్లకుండా ఆరాధించే ఏర్పాటు చేశాడు. ఆ విధంగా విగ్రహారాధనకు నాందిపలికెను. పశ్చాత్తాప పడమని అనేకమంది ప్రవక్తలు హెచ్చరించారు. అహిజా ఇద్దో ఇంకొంతమంది చివరికి పశ్చాత్తాపపడకుండానే దేవునిచే మెత్తబడి చనిపోయిరి.

**యూదయ - దక్షిణ భాగం - రెండు గోత్రాల వారు.**

రెహబాము మొదటిరాజు. ఇతడు 17 సంవత్సరాలు ఏలెను (1 రాజు

11:42–14:31; 2 దిన 9:31–12:16 ) ఇతడు సొలొమోను కుమారుడు అనుభవం గల సలహాదారుల సలహాలను కాదని యువ సలహాదారుల సలహాలను అనుసరించెను. పన్నులు తగ్గించేది పోయి ఇంకా పెంచెను. ఆ విధంగా క్రీ.పూ. 922 దేశం విడిపోయింది. షేమియా ప్రవక్త ఉత్తరభాగాన్ని విడిపోకుండా ఆపకూడదని చెప్పెను. బెన్యామినీయులు, సిమియోను నమ్మకంగా ఉన్నారు. యెరూషలేము ముఖ్యపట్టణంగా ఉండెను. తరువాత కొంతకాలానికే ఐగుప్తువారు దాడిచేసి సొలోమోను దాచిఉంచిన సమస్తాన్ని దోచుకొని పోయారు. వారు దేవునికి కొంతనమ్మకంగా ఉన్నారనిపించినప్పటికీ, వారు బయలు ఆరాధనకు ఉన్నత స్థలాలలను ఏర్పాటు చేసుకున్నారు. మ్రొక్కుటకు కర్రతో చేసిన రూపాలను

# 2 రాజులు: తీర్పు




**శీర్షిక :** యూదయ మరియు ఇశ్రాయేలు రాజులను గురించి

**రచయిత :** తెలియదు(బహుశా యిర్మీయా కావొచ్చును)

**రచనకాలము :** అనేక సంవత్సరాలు

**రచన స్థలం :** యూదయ, ఇశ్రాయేలు

**రచనకాలము :** 267 ఏండ్లు (క్రీ.పూ. 853–586)

**ఎవరికోసం వ్రాయబడింది :** యూదుల కోసం.

**ముఖ్యవచనం :** 2 రాజు 17:7–8, 18–23– "ఎందుకనగా ఇశ్రాయేలీయులు ఐగుప్తుదేశములో నుండియూ ఐగుప్తురాజైన ఫరో యొక్క బలము క్రింద నుండియు తమ్మును విడిపించిన తమ దేవుడైన యెహూవా దృష్టికి పాపముచేసి యితర దేవతల యందు భయభక్తులు నిలిపి, తమ ఎదుట నిలువకుండ యెహూవా వెళ్లగొట్టిన జనముల కట్టడలను, ఇశ్రాయేలు రాజులు నిర్ణయించిన కట్టడాలను అనుసరించుచు ఉండిరి. కాబట్టి యెహూవా ఇశ్రాయేలు వారియందు బహుగా కోపించి, తన సముఖములో నుండి వారిని వెళ్లగొట్టెను గనుక యూదా గోత్రము గాక మరి ఏ గోత్రమును శేషించి యుండలేదు. అయితే యూదావారును తమ దేవుడైన యెహూవా ఆజ్ఞలను విడిచిపెట్టినవారై ఇశ్రాయేలు వారు చేసికొనిన కట్టడాలను అనుసరించిరి. అంతటి యెహూవా ఇశ్రాయేలు వారి సంతతి వారందరిని విసర్జించివారిని శ్రమపెట్టి దోవుడుగాండ్ల చేతికప్పగించి, వారిని తన సముఖము నుండి వెళ్లగొట్టెను.

**ముఖ్యపదాలు :** "రాజు" (340 సార్లు) "ప్రవక్త" (31సార్లు)

**ఉద్దేశము :** ఏ విధంగా యూదయమరియు ఇశ్రాయేలు ప్రాంతాలు చెరపట్టబడినవో చూపించుట

**అంశం :** దేవుడు పాపానికి తీర్పుతీర్చును.

ఆయన ఇశ్రాయేలు గోత్రములను దావీదు ఇంటివారిలో నుండి విడగొట్టివేయగా వారు నెబాతుకుమారుడైన యెరొబామును రాజుగా చేసికొనిరి. ఈ యెరొబాము ఇశ్రాయేలీయుల వారు యెహోవాను అనుసరింపకుండ ఆయన మీద వారిని తిరుగబడ చేసి, వారు ఘోరపాపము చేయుటకు కారకుడాయెను. ఇశ్రాయేలు వారు యెరొబాము చేసిన పాపములలో దేవుని విడువక వాటిని అనుసరించుచు వచ్చిరిగనుక తన సేవకులైన ప్రవక్తల ద్వారా యెహోవా సెలవిచ్చిన మాట చొప్పున, ఆయన ఇశ్రాయేలు వారిని తన సముఖములో నుండి వెళ్లగొట్టెను. ఆ హేతువు చేతవారు తమ స్వదేశములో నుండి అష్షూరు దేశములోనికి చెరగొనిపోబడిరి. నేటి వరకు వారు అచ్చట ఉన్నారు.

ప్రతి సంవత్సరం పన్నులు చెల్లించే వారికి ఒక ఉత్తరం వస్తుంది అందులో ప్రియపన్ను చెల్లింపుదారులారా, మీ పన్నులను చెల్లించే ప్రక్రియను పూర్తి చేయుటకు మాకు మరికొంత సమాచారం అవసరం ఉన్నది. పన్నులు చెల్లించకుండా తప్పించుకోగలరు అనుకుంటారు కొందరు. అయితే వారి పాపాలు వారిని వెంటాడుతూనే ఉంటాయి. దేవుని విషయంలో కూడా అంతే పాపం నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు. ఆదాయ పన్ను శాఖ వారి నుండి తప్పించుకోవచ్చునేమో గాని దేవుని నుండి తప్పించుకోలేరు.

**విషాదం :** (1-17అధ్యాయాలు) వారి పాపాన్ని బట్టి, రాబోయే తీర్పును బట్టి పశ్చాత్తాపపడమని దేవుడు తన ప్రజలను హెచ్చరిస్తారు. ఏలీయా అలాంటి హెచ్చరికనే చేశాడు. 50 సంవత్సరాలు ప్రవక్తగా పనిచేశాక అతడు అగ్ని రథముచే కొనిపోబడెను. ఏలీయా అనంతరం ఏలీషా దేవుని ప్రవక్తగా వచ్చెను (2-8 అధ్యా). అతడు కూడా అనేక అద్భుతాలు చేశాడు (చనిపోయిన వానిని తిరిగి జీవింపజేశాడు కూడాను). ఏలీయా, ఎలీషాలు ఇశ్రాయేలు ప్రాంతానికి (ఉత్తరభాగానికి) సేవచేశారు. 19 మంది రాజులు ఆ ప్రాంతాన్ని ఏలారుగాని వారిలో ఒక్కరు కూడ దేవుని అనుసరించలేదు. దక్షిణ భాగంలో అనగా యూదయ ప్రాంతంలో 20 మంది రాజులలలో 8 మంది దేవుని అనుసరించారు.

యెహూ ఆరంభంలో మంచిగానే ఉండెను (9-10) ఎలీషా ఆధిపత్యంలో అహాబు కుటుంబం నుండి అతని ప్రభావం నుండి ఆ దేశాన్ని శుద్ధిచేసెను గాని చివరికి విగ్రహారాధనలో పడిపోయెను. అహాబు మనుష్యుడు ఏది విత్తునో దానినే కోయును.

అనే సహజ ప్రకృతి నియమానికి మంచి ఉదాహరణ (గలతీ 6:7). " మీ పాపము మిమ్మును పట్టుకొనును" (సంఖ్యా 32:23). ఆహాబు, యెజెబెలు భయంకరమైన మరణాన్ని రుచిచూశారు. (9వ అధ్యా).

చాలా కాలం క్రితం ఒక ప్రఖ్యాత కమ్మరివాడు చెరసాలో వేయబడెను. తనను బంధించిన ఆ గొలుసును క్షుణ్ణంగా పరిశీలించుచుండెను. ఎక్కడైన లోపం ఉందేమో చూసి దాని ద్వారా బంధకాలను తెంచుకోవచ్చుననే ఉద్దేశంతో. ఆ గొలుసు ను తానే తయారు చేశాడు గనుక అది ఎంతో దృఢంగా ఉండెను. తాను తయారు చేసిన గొలుసును విరవకుండా తెంచలేరని ధీమాగా దానిని చేశాడు. అలాగే అహాబు కూడా తన గొలుసును తానే తయారు చేసుకుని దానిచే బంధింపబడెను. పాపపు సంకెళ్లు తెంచలేవు. యూదయ ప్రాంతం యోహాషు ఏలుబడిలో దేవుని వైపు తిరిగింది (11 అధ్యా). అయితే కొద్దిరోజులకే తిరిగి పడిపోయింది (12 అధ్యా). ఈ లోగా ఇశ్రాయేలు దేవునికి మరింత దూరమైంది (13 అధ్యా). ఉజ్జీయ్యా యూదయ ప్రాంతాన్ని దేవుని యొద్దకు తెచ్చాడు. గాని గర్వం ఉచ్చులో పడిపోయెను (14-16 అధ్యా). చివరికి ఇశ్రాయేలు చెరపట్టుబడింది (17 అధ్యా). ఇశ్రాయేలు ప్రాంతంలో వున్న దేవునియందు భయభక్తులు గల వారు యూదయ ప్రాంతానికి వలసవెళ్లారు. ఆ విధంగా పన్నెండు గోత్రాలవారు యూదయలో స్థిరపడ్డారు.

**కఠిన శ్రమ -** (18-25) ఇశ్రాయేలు చెరపట్టపడిన తరువాత 150 సంవత్సరాల పాటు అతికష్టంగా కొనసాగింది. ఇద్దరి అతి చెడ్డ రాజుల మధ్య హిజ్కీయా అనే మంచి రాజు యూదయ ప్రాంతాన్ని ఏలెను. (18-20 అధ్యా) అయితే అతని కుమారుడైన మనష్షే తన కుమారులను బలిచ్చెను (21 అధ్యా). యోషియా అతని కుమారుడు తండ్రికి భిన్నంగా ఉండెను. ఎంతో భక్తిగల రాజుగా పేరుగాంచెను (22 అధ్యా). అయితే యూదయ ప్రాంతాన్ని ఏలిన చివరి రాజులు అందరూ దేవునికి దూరంగా నడిచిరి (24 అధ్యా). చివరికి యూదయ ప్రాంతం కూడా బబులోనుకు చెరపట్టబడెను (24-25). పాపం నిండా ముంచేసే వరకు ఎవరికి తెలియకుండా భ్రమపెట్టును.

**సత్యం** దేవుడు పాపానికి తప్పక తీర్పు తీర్చుతాడని బైబిలు స్పష్టం చేస్తుంది. గలతీ 6:7-8- "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో <u>ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరము</u>

నుండి క్షయమగు పంటను కోయును, ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంటను కోయును.” సామెతలు 1:31 ఇలా చెబుతుంది–“కాబట్టి వారు తమ ప్రవర్తనకు తగిన ఫలము ననుభవించెదరు. ”“దుష్టుని దోషములు వానిని చిక్కుల బెట్టును వాడు తన పాపపాశములవలన బంధింపబడును. శిక్షలేకయే అట్టివాడు నాశనమగును అతి మూర్ఖుడై వాడు త్రోవతప్పిపోవును” (సామె 5:22–23). “దౌష్ట్యమును విత్తువాడు కీడును కోయును వానిని క్రోదమను దండము కాలిపోవును” (సామె 22:8).

దేవుని ప్రజలు తప్పక పాపంనుండి మరల వలెను. మనకు మినహాయింపు లేదు సరికదా మరింత జవాబుదారులం (మత్త 3:9–10). “దేవుని ఇంటి నుండే తీర్పు ప్రారంభమగును” (1 పేతురు 4:17). లూకా 12:47–48 ఈ విధంగా చెబుతుంది. “తన యజమాని చిత్తము యెరిగియుండయు సిద్ధపడక అతని చిత్తము చొప్పున జరిగింపక ఉండు దాసునికి అనేకమైన దెబ్బలు తగులును. అయితే తెలియక దెబ్బలకు తగిన పనులు చేసినవానికి కొద్ది దెబ్బలే తగులును. ఎవనికి ఎక్కువగా ఇయ్యబడెనో వాని యొద్ద ఎక్కువగా తీయజూతురు, మనుష్యులు ఎవనికి ఎక్కువగా అప్పగింతురో వాని యొద్ద ఎక్కువగా అడుగుదురు”

మనం మన రక్షణను పోగొట్టుకోము (రోహ 8:1) గాని అంత మాత్రాన మనం పాపం చేయుటకు మినహాయింపు కాదు.

ఒక రోజున అమెరికాలో నాలుగు వందల సంవత్సరాల చెట్టు ఒకటి కూలిపోయింది. కొలంబస్ నాటిన చెట్టు అది. దాని మీద 14సార్లు పిడుగుపడిన నిలద్రొక్కుకుంది. నాలుగు వందల సంవత్సరాలు ఎంతో బలమైన తుఫాను గాలులను సహితం తట్టుకొని నిలిచింది. భూకంపాలను ఎదుర్కొని నిలిచింది. మంచుతుఫానులను ఎదురొడ్డి నిలిచింది. అయితే చివరికి ఒక చిన్న పురుగు దాని మొండెమును తినేసింది. బెరడును తొలచి, లోపలికి ప్రవేశించి దానిలోని గుజ్జును పీల్చేసి నిర్వీర్యం చేసింది. చివరికి అది బలహీనపడి కూలిపోయింది.

**సంక్షిప్త వివరణ : 2 రాజులు**

**1 విషాధం :** ఇశ్రాయేలు చివరి రోజులు 1–17

ఎ) ఏలీయా తొలగింపు 1–2

బి) ఎలీషా పరిష్కారం 3-8

సి) శత్రువుల తిరుగుబాటు 8

డి) యెహూ ఉజ్జీవం 9

ఈ) ఆహాబు తొలగింపు 10

యఫ్) యూదయ పశ్చాత్తాపం 11

జి) యూదయ పడిపోవడం 12

హెచ్) ఇశ్రాయేలు పడిపోవడం 13

జె) ఇశ్రాయేలు, యూదయ పతనం 14-16

ఐ) ఇశ్రాయేలు చెర 17

**11. కఠిన శ్రమ :** యూదయ చివరి రోజులు 18-25

ఎ) హిజ్కియా సంస్కరణలు 18-20


బి) యూదయ పతనం 21

సి) యోషియా సంస్కరణలు 22

డి) యూదయ పతనం 23

ఈ) యూదయ తిరుగుబాటు 24

# 1,2 దినవృత్తాంతములు: విశ్వసనీయత




**శీర్షిక :** యూదులు గ్రంథంలో ఒకే ఒక గ్రంథం
**రచయిత :** అనేకులు, సంకలనం- ఎజ్రా
**రచనకాలము :** బబులోను నుండి తిరిగి వచ్చాక
**రచన స్థలం :** యూదయ,
**రచనకాలము :** ఆదాము నుండి కోరేషు (క్రీ.పూ.536)
**ఎవరికోసం వ్రాయబడింది :** బబులోను నుండి తిరి వచ్చిన యూదులకు

**ముఖ్యవచనం :** 1 దిన 17:10- "నీ పగవారి నందరిని నేను అణచివేసెదను. అదియు గాక- యెహోవా నీకు సంతతి కలుగజేయునని నీకు నేను తెలియజేసితిని."

**ముఖ్యపదాలు :** "దావీదు" (18 సార్లు) "దేవుని మందిరం" (148 సార్లు) "యాజకుడు" (80సార్లు)

**ఉద్దేశము :** ఆధ్యాత్మిక దృష్టి కోణంలో ఇశ్రాయేలు చరిత్రను చూపించుట, ఎల్లప్పుడు నమ్మకంగా వున్న దేవునికి నమ్మకంగా ఉండాల్సిన ప్రాధాన్యతను చూపించుట

**అంశం :** దేవుడు విశ్వాసనీయత

నేడు ఇతరుల పట్ల విశ్వాసనీయంగా ఉండడం హర్షణీయమైన గుణమని భావించుటలేదు. అన్ని విధాలుగా మనపట్ల మనం నమ్మకంగా ఉండాలని బోధిస్తుంది. నేటి సమాజం మన అవసరాలకే ప్రాధాన్యత నివ్వాలి. మనకు మనం సంతృప్తిపంచుకోవాలి. మనకు లాభసాటిగా ఉంటేనే జీవిత భాగస్వామిపట్ల, కుటుంబంపట్ల, ఉద్యోగం పట్ల, దేశంపట్ల క్రీడా జట్టుపట్ల నమ్మకం ఉండాలి నేటి లోకం భావిస్తుంది. పరిస్థితులు కఠినమైనప్పుడు ప్రజలు వేరే మార్గం వెతుకుటకు వెనుకాడరు. అదృష్టవశాత్తు దేవుడు అలాంటివాడుకాడు. దినవృత్తాంతగ్రంథాలు ఈ విషయాన్ని ఋజువుపరుస్తాయి

హెబ్రీ బైబిలులో ఒకే గ్రంథంగా పొందుపరచబడింది. దిన వృత్తాంత గ్రంథంలో 1,2 సమూయేలు మరియు 1, 2 రాజుల గ్రంథాలలోని సమాచారమే ఉంటుంది. అయితే భిన్నమైన దృక్పథంతో వ్రాయబడింది. అవి పౌర, రాజకీయ సంఘటనలను

గురించి ప్రస్తావిస్తే ఇవి దేవుని దృష్టిలో విషయాలను వివరిస్తాయి. ఉదా :1 సమూ 31 అధ్యాయం సౌలు మరణాన్ని మానవదృష్టితో వివరిస్తుంది. ఆయన ఏ విధంగా మరణించాడు అని. 1, 2 సమూయేలు మరియు 1, 2 రాజుల గ్రంథాలు మానవుడు ఏ విధంగా విశ్వాసభ్రష్టుడైయ్యాడో చూపిస్తాయి గాని 1,2 దినవృత్తాంతాలు దేవుడు ఎంతగా విశ్వసనీయుడో చూపిస్తాయి. (మానవుడు ఎంత నమ్మక ద్రోహియైనప్పటికీ) (ద్వితీయోపదేశం అంశంవలె ఉంటుంది)

**యూదయ రాజుల కాల క్రమం** : (1 దిన 1-9) – ఆదాము నుండి బబులోను చెర వరకు వంశావళి వివరించబడింది. స్త్రీ సంతానం నుండి మెస్సీయాను పంపిస్తానన్న దేవుని వాగ్దానపు నెరవేర్పును చూపిస్తుంది (ఆది 3:14-15). యేసే ఆ మెస్సీయా అని నిరూపించుటకు అది పునాదిని వేస్తుంది (మత్తయి 1, లూకా 3) విశేషంగా ఈ విధానము అబ్రాహాముకు దేవుని నమ్మకత్వాన్ని చూపిస్తుంది (ఆయన నుండి అనేక జాతులు వచ్చాయి), దావీదు విషయంలో కూడా, (యూదయను పాలించుటకు అతని సంతానాన్ని దేవుడు నియమించెను) అలాగే ప్రతి ఒక్కరికి ఎందుకనగా దేవునికి సమస్తం, అందరూ పేర్లతో సహా తెలుసు.

**యూదయ రాజుల దినవృత్తాంతములు :** (1 దిన 10-2 దిన 36) దైవభక్తిగల రాజుల గురించి పేర్కొనడం జరిగింది. ఈ విభాగం దావీదు మందసాన్ని యెరూషలేముకు స్తుతి ఆరాధనతో తీసికొని రావడంతో ఆరంభమౌతుంది (1 దిన 10-16) దిన వృత్తాంత గ్రంథాలలో బత్సెబాతో దావీదు పాపము పేర్కొనబడలేదు. అది క్షమించబడింది, అది ముగించబడింది. దృష్టాంతము దేవుని నమ్మకత్వం మీదే (మెస్సీయా వరకు తన సంతానము రాజ్యమేలునన్న) దేవుడు దావీదుతో చేసిన వాగ్దానాలను తప్పక నెరవేర్చాడు (1 దిన 22-27). దేవాలయ నిర్మాణం కోసం దావీదు సిద్ధపడిన విధానం వివరంగా చెప్పబడింది (1 దిన 22-27). అదే విధంగా సొలోమోను దేవాలయాన్ని నిర్మించడం గురించి చెప్పబడింది (2 దిన 1-9). దేవాలయాన్ని గురించి ఈ అధ్యాయాలలో వివరించబడింది ఎందుకంటే దేవునితో ప్రజలను సంధానపరచేది దేవాలయము. వారికున్న దంతయు దేవుని నుండే వచ్చిందని అది వారికి జ్ఞాపకం చేస్తుంది. దేవుడు మానవుని పట్ల నమ్మకత్వాన్ని కనబరచిన రీతిలోనే మానవుడు దేవాలయం ప్రజలకు పిలుపునిస్తుంది. దేవాలయం ఒక భవంతికాదు, అది జీవన విధానం!

యూదయ, ఇశ్రాయేలుగా దేశము విడిపోయినప్పుడు, దినవృత్తాంతములు యూదయ రాజులను మాత్రమే అనుసరిస్తుంది. అవిశ్వాసంతో నిండిన ఇశ్రాయేలు భాగం పరిగణలోకి తీసుకోబడలేదు. నిజమైన విశ్వాసులు యూదయ ప్రాంతానికి తరలి వెళ్లారు గనుక దేవునియందు భయభక్తులు గల వారి శేషము 12 గోత్రాల వారు దక్షిణ రాజ్యంలోనే ఉండిపోయారు. యెరొబామును ఓడించుటకు దేవుడు అబీజాకు సామర్థ్యాన్ని కలుగజేయుట ద్వారా దేవుని నమ్మకత్వం కనబడుతుంది (2 దిన13). ఆసా ఐతోపేలును ఓడించెను (14 అధ్యా) యెహోషాపాతు మోయాబీయులను ఓడించెను (20) హిజ్కియా సెన్నాకెరీబునుండి విడుదల పొందెను (31) యూదులలో స్పందనగా ఉజ్జీవము (5) కలిగెను. దేవాలయం మరమ్మతు చేయబడెను. దుష్టుడైన రాజు ప్రజలను దేవునికి దూరంగా నడిపించిన ప్రతిసారి వారు తిరిగి దేవుని యొద్దకు నడిపించబడిరి (23-24, 30,35). ఆయనకు వారు ఎంత నమ్మకంగా ఉన్నారో చూపిస్తాయి. అయితే దురదృష్టవశాత్తు వారు దేవునికి నమ్మకంగా ఉన్న సందర్భాలకంటే ఆయనకు దూరమైన సందర్భాలే అధికం గనుక వారిని బబులోను చెరకు అప్పగించెను. అయినా దేవుడు తన ప్రజలతో శేషాన్ని మిగిల్చి, వారిని భవిష్యత్‌లో విడిపించే, పునరుద్ధరిస్తానని వాగ్దానం చేశాడు.

ఎల్లోస్టోన్ నేషనల్ పార్క్‌లలో ఒక ప్రఖ్యాత గీసర్ ఉంది 10, 12 వేల గాలన్ల నీటిని 150 అడుగుల ఎత్తులోకి చిమ్ముతుంది. అక్కడ ఎన్నో గీసర్‌లు ఉన్నప్పటికీ ఈ గీసరే ఎందుకు ప్రసిద్ధికెక్కింది అంటే ప్రతి 65.5 నిముషాలకు కచ్చితంగా నీటిని చిమ్ముతుంది. మిగతా గీజర్‌లు ఎప్పుడు చిమ్ముతాయో, ఎప్పుడు ఆగిపోతాయో ఎవరికి తెలియదు గాని ఈ గీజర్ కచ్చితంగా పనిచేస్తుంది. "నమ్మకమైన గీజర్" ఇది. ఆయన మనపట్ల విశ్వసనీయతను ఏ విధంగా చూపిస్తున్నాడో అదే విధంగా మనంకూడా ఆయన పట్ల విశ్వాసనీయతను చూపించాల్సి ఉంది. దేవుని విశ్వాసనీయతను బట్టి ఆయనకు వందనాలు చెల్లించుము. ఆయనకు నీవు కూడా నమ్మకంగా ఉండుము "ప్రతి వాడును నమ్మకంగా ఉండుట ఆవశ్యకము" (1 కొరింథీ 4:2).

**దిన వృత్తాంతముల సంక్షిప్త వివరణ:**

**1. యూదయ రాజుల కాలానుక్రియపట్టిక 1 దిన 1-9**

1) రాజుల వంశము 1-4

2) సంబంధికులు వంశము 5-9

**11. యూదయ రాజుల దినవృత్తాంతములు 1 దిన10-19**

ఎ) దావీదు సింహాసనము 1 దిన20-29 /2 దిన1-26

1) దేవుని మందసము 10-16

2) దేవుని నిబంధన 17-21

3) దేవుని ఆలయము 22-27

4) దేవుని సందేశము 28-24

బి) సొలొమోను దేవాలయం 2 దిన 1-9

1) సొలోమోను మందిరము 1-5

2) సొలోమోను ఆరాధన 6-9

సి) చరిత్ర సాక్ష్యము 2 దిన 10-26

1) విభజింపబడిన రాజ్యం 10-11 (పతనావస్థ)

2) సంస్కరణ మరియు తిరిగి పడిపోవుట దక్షిణ రాజ్యము 12-26